


ఒక ఉద్యమం ప్రపంచాన్ని ఆకర్షించింది. ఒక వ్యక్తి దీక్ష దేశ ప్రజలను ఆలోచింపజేసింది. ఓ నాయకుడి ఉపన్యాసం ప్రజలకు స్ఫూర్తినిచ్చింది. బక్క పలచటి వ్యక్తిపై అచెంచల విశ్వాసం పెట్టుకున్నారు ఆ ప్రాంత ప్రజలు. ఆరు దశాబ్దాలు దోపిడీకి గురైన ప్రజానీకం ఒక్క గొంతుగా నిలిచింది. ఆత్మహత్యలు, బలిదానాల సాక్షిగా కొనసాగిన ఉద్యమంలో చావో రేవో తేల్చుకునేందుకు బరిగీసి నిలిచిన రోజు అది. ఒకరి దీక్ష నాలుగు కోట్లమంది ప్రజల ఆకాంక్ష నెరవేర్చింది. ఒక నాయకుడి ఆమరణ దీక్ష దేశ ప్రజలను కదిలించింది. విద్యార్థులు, యువకులు, మేధావులు అందరూ కలిసి ఒక్కటై అడుగులో అడుగువేశారు. 'నా ఒక్కడి వల్ల దేశం మారిపోతుందా? అనుకునే ఏ ఒక్కడి వల్లా దేశానికి ప్రయోజనం లేదు' అన్న క్యూబా దేశ మాజీ అధ్యక్షుడు, ప్రపంచ విప్లవకారుడు ఫిడెల్ కాస్ట్రో మాటలను ఆదర్శంగా తీసుకుని అహింసామార్గంలో ఉద్యమాన్ని నడిపిన మహానేత అతడు. అతడే.. తెలంగాణ ముద్దుబిడ్డ కేసీఆర్. ఆయన చేపట్టిన దీక్ష తెలంగాణ మలివిడత ఉద్యమంలో స్వరాష్ట్ర ఏర్పాటుకు నాంది పలికింది. ఆయన చేపట్టిన ఆ దీక్షకు నేటితో (శుక్రవారం)తో పదిహేనేళ్లు పూర్తవుతోంది. ఆ చారిత్రక ఘట్టానికి ఖమ్మం వేదిక కావడమే అపూర్వం.

- చరిత్రాత్మక ఘట్టానికి వేదికైన జిల్లా
- ఉద్యమ స్వరూపాన్ని మార్చిన కేసీఆర్ ఆమరణ దీక్ష
- కరీంనగర్‌లో అరెస్టు..
- ఖమ్మం జైలుకు తరలింపు
- తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రకటనకు ఇక్కడే బీజం

నేటి దీక్షా దివస్

# మలి విడతకు.. మలుపు ఖమ్మం

మలిదశలో ఉవ్వెత్తున ఎగిసిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమ స్వరూపాన్ని కేసీఆర్ దీక్ష సమూలంగా మార్చి వేసింది. నాడు ఆమరణ దీక్షకు పూనుకున్న కేసీఆర్‌ను కరీంనగర్‌లో అప్పటి పోలీసులు అరెస్టు చేశారు. ఉద్యమ ప్రభావం తక్కువగా ఉంటుందనుకొని నేరుగా ఖమ్మం సబ్ జైలుకు తరలించారు. ఇక్కడ కూడా తొమ్మిదిరోజులపాటు కేసీఆర్ దీక్ష కొనసాగించడం, ఉద్యమకారులు భగ్గుమనడం, తెలంగాణ రావణ కాష్టం కావడం.. ఫలితంగా 'తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం' ప్రకటనకు బీజం పడడం వంటివి తెలంగాణ ప్రజల గుండెల్లోనేగాక ముఖ్యంగా ఖమ్మం జిల్లా ప్రజల హృదయాల్లోనూ చెరగని చిహ్నాలు. ఖమ్మంలో కేసీఆర్ దీక్షకు సమాంతరంగా జరిగిన పోరాటాలు ఎన్నటికీ చెదిరిపోని సాక్ష్యాలు. వీటన్నింటినీ నెమరువేసుకునేందుకే తెలంగాణ ప్రజలు నేడు దీక్షా దివస్ జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా 'నమస్తే తెలంగాణ' అందిస్తున్న ప్రత్యేక కథనం.

-ఖమ్మం, నవంబర్ 28
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

## కేసీఆర్ లేకపోతే తెలంగాణే లేదు..



కేసీఆర్‌ను అరెస్ట్ చేసి ఖమ్మం తీసుకొచ్చిన రోజు కోర్టుకు సెలవు. ఏ ఒక్క మెజిస్ట్రేట్ లేరు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీరామమూర్తి ఇంటి దగ్గర కేసీఆర్‌ను రిమాండ్ చేశారు. అప్పుడు నేను 'జై తెలంగాణ' అని నినాదాలు చేశాను. ఉద్యమంలో పాల్గొన్నందుకు చాలా గర్వపడుతున్నాను. కేసీఆర్ లేకపోతే తెలంగాణ రాష్ట్రమే వచ్చేది కాదు.

–గుండ్లపల్లి శేషగిరిరావు, ఉద్యమకారుడు

అది 2009, నవంబర్ 29వ తేదీ. మెదక్ జిల్లా సిద్దిపేట సమీపంలోని రంగదామ్‌పల్లిలో కేసీఆర్ ఆమరణ దీక్షకు వేదిక సిద్ధమైంది. కరీంనగర్ నుంచి వేదిక వద్దకు దాదాపు 159 వాహనాల భారీ కాన్వాయితో బయల్దేరి వెళ్లిన కేసీఆర్‌ను జిల్లా కేంద్రం పొలిమేర్లలోని అల్గునూర్ వద్ద వ్యూహాత్మకంగా పోలీసులు అరెస్టు చేశారు. అక్కడి నుంచి వరంగల్ మీదుగా రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించాలనుకున్నారు. చివరికి ఖమ్మం వైపు దారి మళ్లించారు. మధ్యాహ్నం 12:15 గంటలకు ఖమ్మంలోని చర్చికాంపౌండ్ ఏరియాలో నివాసముండే సెకండ్ క్లాస్ స్పెషల్ మెజిస్ట్రేట్ సీహెచ్ శ్రీరామమూర్తి ఇంటి ఎదుట కేసీఆర్‌ను తీసుకువస్తున్న కాన్వాయి ఆగింది. అప్పటికే కేసీఆర్‌ను అరెస్టు చేసి తీసుకువస్తున్నట్లు అప్పటి ఏఎస్పీ పరిమళ, ఎస్పీ కాంత్రిరాణా మెజిస్ట్రేట్‌కు సమాచారం అందించారు. మెజిస్ట్రేట్ ఎదుట కేసీఆర్‌తోపాటు నాయిని నర్సింహారెడ్డి, విజయరామారావు, వరంగల్ ఎంపీ రాజయ్యలను హాజరుపరిచారు. కేసీఆర్ సహా 9 మందికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వీరిపై అప్పటికే ఖమ్మం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఐపీసీ 114, 117, 120 (బీ), 143, 153 (ఏ), 188, 505 (2), 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అయితే బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయనకు సలహా



ఇచ్చేందుకు కొంతమంది ప్రయత్నించారు. కానీ, కేసీఆర్ అంగీకరించకపోవడంతోపాటు నిరాహార దీక్షను జైలు నుంచే కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. అదే రోజు 12:45 గంటలకు ఖమ్మం సబ్ జైలుకు తరలించారు. అప్పటికే తెలంగాణలో నిరసన జ్వాలలు పెల్లుబికాయి. నవంబర్ 29న తెలంగాణ బంద్‌కు టీఆర్ఎస్ (ఇప్పుడు బీఆర్ఎస్) పిలుపునిచ్చింది. అదే రోజు న్యాయవాది సుగుణారావు నేతృత్వంలో ఇద్దరు న్యాయవాదులు కేసీఆర్‌ను కలుసుకొని మాట్లాడారు. బయటకు వచ్చి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని వివరించారు. ఆయన పూర్తిగా బలహీనపడ్డట్టు తేల్చారు. సాయంత్రం ఖమ్మం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ పాపాలాల్ ఆధ్వర్యంలో డాక్టర్లు కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని పరీక్షించి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ధ్రువీకరించారు.

## ప్రభుత్వ వైద్యశాలలో ఉద్యమసారథి

నవంబర్ 30న కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి పరిశీలించిన డాక్టర్లు.. ఆయనను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసీఆర్ దీక్షను విరమించారని, ఆయన సూచన మేరకే పండ్ల రసం అందించామని ఏఎస్పీ పరిమళ ప్రకటిస్తూ అందుకు సంబంధించిన ఫొటోలను, వీడియో టేప్‌లను పత్రికలకు విడుదల చేశారు. దీంతో అందరూ నిర్ఘాంతపోయారు. అర్ధాంతరంగా దీక్షను విరమించడాన్ని సహించని ఓయూ విద్యార్థులు కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. దురుద్దేశపూర్వకంగా తన దీక్షను భగ్నం చేసేందుకు పోలీసులు, అప్పటి పాలకులు డ్రామా చేశారని కేసీఆర్ ఆరోపించారు. తాను దీక్ష కొనసాగిస్తున్నట్లు విస్పష్టంగా ప్రకటించారు. దీంతో విద్యార్థులు శాంతించారు. చల్లారి పోయిందనుకున్న అగ్గి మళ్లీ రాజుకొని నిప్పులగుండమై నింగినంటింది. ఉద్యమ స్వరూపాన్నే మార్చివేసింది.



2009 సెప్టెంబర్ 29న కరీంనగర్‌లో అరెస్టు చేసి ఖమ్మం తీసుకొచ్చాక ఇక్కడి ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో తెలంగాణ స్వాప్నికుడు, ఉద్యమసారథి కేసీఆర్ ఆమరణ దీక్ష కొనసాగిస్తున్నప్పటి దృశ్యం

## జైల్లో దీక్ష కొనసాగించిన కేసీఆర్..



కేసీఆర్‌ను ఖమ్మం జైల్లో నిర్బంధించిన వెంటనే న్యాయవాదులు స్పందించారు. జైల్లో మెరుగైన వైద్యం కల్పించాలని, ఒక పార్లమెంట్ సభ్యుడిని 'సీ' క్లాస్ జైల్లో ఉంచడం మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని, కేసీఆర్ 'క్రానిక్ డయాబెటిక్' పేషంటని, 60 ఏళ్లు ఉంటాయని, ప్రత్యేక వైద్యులను తెప్పించాలని న్యాయస్థానాన్ని కోరారు. చర్లపల్లి (హైదరాబాద్) జైలుకు పంపించాలని దావా వేశారు. కానీ, ఆనాటి ప్రభుత్వం చాలా నియంతృత్వంగా వ్యవహరించింది. కేవలం ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలోనే వైద్యం చేయించింది. ఆధునిక వైద్య సౌకర్యాన్ని గానీ, ప్రత్యేక వైద్యులను గానీ కేటాయించలేదు. దీంతో ఆస్పత్రిలోనే కేసీఆర్ నిరాహార దీక్ష కొనసాగించారు. ఎలాంటి మందులనూ తీసుకోలేదు. 'తెలంగాణ సాధనే నా లక్ష్యం' అంటూ స్పష్టం చేశారు. 'ఆస్పత్రిలో ఉంచినా, జైల్లో ఉంచినా బలవంతంగా నా చేత దీక్ష మాన్పించడం మీ తరం కాదు' అంటూ నాటి సీమాంధ్ర పాలకులకు స్పష్టం చేశారు. జైల్లో ఉండి కూడా స్వయంగా తన దస్తూరితోనే మానవ హక్కుల చైర్మన్‌కు లేఖ రాశారు. 'నాకు బెయిల్ ఇవ్వకండి' అని కేసీఆర్ చెప్పారు. తెలంగాణ కోసం శ్రీకాంతాచారి పెట్రోల్ పోసుకొని బలవన్మరణం పొందాడని కేసీఆర్‌కు మొట్టమొదటిసారిగా చెప్పింది ఖమ్మం న్యాయవాది మేకల సుగుణారావే. కేసీఆర్ వెంటనే కన్నీటి పర్యంతమయ్యారు. 'తెలంగాణకోసం ప్రాణాలు త్యాగం చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను. మరెవరూ ప్రాణాలు తీసుకోవద్దు' అంటూ కేసీఆర్ ప్రకటించారు. 'తెలంగాణ భావితరాల కోసం, వారి జీవితాల్లో వెలుతురు నింపడం కోసం మీలాంటి వారు ఆత్మహత్యలు మానండి. మనో నిబ్బరంతో ఉద్యమంలో భాగస్వాములు కండి?' అంటూ ఉద్యమసారథి పిలుపునిచ్చారు.

## కేసీఆర్‌ని కలుస్తాననుకోలేదు..



2009 డిసెంబర్ 1న రాత్రి ఖమ్మం ఆస్పత్రిలో కేసీఆర్ కలిశాను. ఆ రోజు కేటీఆర్‌ను, హరీశ్‌రావును కూడా పోలీసులు ఆసుపత్రిలోకి రానివ్వలేదు. నా ఫోన్ నుంచే మానవ హక్కుల చైర్మన్‌తోనూ, అప్పటి సీఎం రోశయ్యతోనూ కేసీఆర్ మాట్లాడారు. కేసీఆర్‌తో సుమారు 2 గంటలకు పైగా ఉన్నాం. ఉద్యమకారుడిగా కొనసాగడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను.

–బిచ్చాల తిరుమలరావు, న్యాయవాది, న్యాయవాద జేఏసీ చైర్మన్

## కుటుంబ సభ్యుడిగా భావిస్తారు..



కేసీఆర్ స్ఫూర్తితోనే 2008లో తెలంగాణ ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం ఏర్పాటు చేశాం. ఖమ్మంలో ఆనాడు 'జై తెలంగాణ' అనడానికే చాలా మందికి ధైర్యం లేదు. కేసీఆర్ రెండుసార్లు మా ఇంట్లో బస చేయడం మా అదృష్టం. కేసీఆర్ మా ఇంట్లో ఉండగానే వారికి ఫోన్ వచ్చింది. 'ఎక్కడ ఉన్నారు?' అని వారు కేసీఆర్‌ను అడిగితే.. 'మా కృష్ణ ఇంట్లో ఉన్నాను' అని చెప్పిన మాట నా జీవితంలో ఎప్పటికీ మరువలేను.

–ఆర్జేసీ కృష్ణ, బీఆర్ఎస్ నాయకుడు

## కేసీఆర్‌తోనే 3 రోజులు జైల్లోనే..



కేసీఆర్‌పై దేశ ద్రోహం కేసు పెట్టి ఖమ్మం జైలుకు తరలించారు. ఆ కేసులో కేసీఆర్ ఏ1, నేను ఏ2గా ఉన్నాను. నాతో పాటు నాయిని నర్సింహారెడ్డి, కెప్టెన్ లక్ష్మీకాంతారావు, డాక్టర్ విజయరామారావు, కన్నెబోయిన రాజయ్యయాదవ్ ఉన్నారు. వారితోపాటు ఖమ్మానికి చెందిన బత్తుల సోమయ్య, గోపగాని శంకర్‌రావు, అబ్దుల్ నబీ కూడా జైల్లో ఉన్నారు. కేసీఆర్ లాంటి వ్యక్తితో ఉద్యమంలో నడవడంతో నా జీవితం సార్థకమైంది.

–డోకుపర్తి సుబ్బారావు, ఉద్యమకారుడు

## కేసీఆర్‌ను చంపుతారని భయపడ్డాం..



కరీంనగర్‌లో కేసీఆర్‌ను అరెస్ట్ చేసి రాజమండ్రి జైలుకు తరలిస్తున్నారని తెలిసి ఆ రోజున నాలో దుఃఖం ఆగలేదు. రాజమండ్రిలో కేసీఆర్‌ను చంపుతారని మేం భయపడ్డాం. కేసీఆర్ లేకపోతే రాష్ట్రం రాదని ఆందోళన చెందాం. ఆ తరువాత కేసీఆర్‌ను ఖమ్మం తీసుకొచ్చి ఇక్కడి జైలుకు తరలించారు. మేం రోడ్డెక్కి ఉద్యమాలు చేశాం.. లాఠీ దెబ్బలు తిన్నాం.

–పగడాల నరేందర్, ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నాయకుడు

## హెచ్‌ఆర్‌సీ ఆదేశం మేరకు హైదరాబాద్‌కు..



హెచ్‌ఆర్‌సీ నంబర్ 8944/2009 పేరిట డిసెంబర్ 2న మానవ హక్కుల సంఘం (హెచ్‌ఆర్‌సీ) నుంచి కూడా అనేక మార్గదర్శకాలు వచ్చాయి. నిపుణులైన వైద్యులతో వైద్య సౌకర్యం ఏర్పాటు చేయాలని, కేసీఆర్ ఆరోగ్యంలో వస్తున్న మార్పుల పట్ల ప్రతి నిమిషం జాగ్రత్తలు తీసుకోవాలని అప్పటి ప్రభుత్వానికి హెచ్‌ఆర్‌సీ స్పష్టం చేసింది. పోలీసులు ఆస్పత్రిలో ఉండి భయభ్రాంతులకు గురిచేయడం మానవ హక్కుల ఉల్లంఘనే అని ప్రకటించింది. కానీ, ఈ మార్గదర్శకాలను అప్పటి పోలీసులు, పాలకులు ఏమాత్రం పాటించలేదు. వందలమంది పోలీసుల పహారాతో ఖమ్మం ప్రభుత్వాసుపత్రి నిండిపోయింది. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 2 వరకు ఖమ్మం జైలు నిర్బంధంలో, ప్రభుత్వాసుపత్రిలో కేసీఆర్ ఉన్నారు. అనంతరం మానవ హక్కుల సంఘం ఆదేశం మేరకు హైదరాబాద్‌కు ఆయనను తరలించారు.

## కేసీఆర్ అంటే నాకు ప్రాణం..



కేసీఆర్ అంటే నాకు ప్రాణం. ఆయనపై ఉన్న ప్రేమ, అభిమానంతోనే తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాను. ప్రాణానికి ఎదురొడ్డి పోరాడాను. ప్రతి ఉద్యమంలో ముందుండి నడిచాను. ఆ రోజు 'జై తెలంగాణ' అనేందుకు ఇక్కడి ప్రజలు భయపడ్డారు. కానీ కేసీఆర్ ఉన్నాడనే ధైర్యంతోనే మేం 'జై తెలంగాణ' అని నినదించాం. చేతిలో గులాబీ జెండా ఉండడంతో భయపడలేదు. కేసీఆర్‌తో దీక్షలో పాల్గొన్నాను. ఆయనతోనే నడిచాను.

–ఉప్పల వెంకటరమణ, ఉద్యమకారుడు

## 'దీక్షా'దక్షుడు కేసీఆర్: వద్దిరాజు, రేగా వనమా



సమావేశంలో మాట్లాడుతున్న వద్దిరాజు, చిత్రంలో రేగా, వనమా


భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా మలిదశ ఉద్యమానికి ఊపిరి పోసి.. ఢిల్లీ పెద్దలను గడగడలాడించిన తెలంగాణ సాధకుడు కేసీఆర్ అని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వద్దిరాజు మాట్లాడారు. ఆనాడు కేసీఆర్ పట్టుదలతో దీక్ష చేయకపోతే ఈనాడు మనం తెలంగాణ రాష్ట్రాన్ని చూసే వాళ్లం కాదన్నారు. అటువంటి నాయకుడిని కొందరు కాంగ్రెస్ మూర్ఖులు ఆనవాళ్లు లేకుండా చేస్తామని అనడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ జిల్లా ఇన్‌చార్జి నాయకత్వంలో దీక్షా దివస్ సందర్భంగా కొత్తగూడెంలో శుక్రవారం భారీ ర్యాలీ ఉంటుందని అన్నారు. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ అంటేనే కేసీఆర్ అని అన్నారు. పార్టీ నేతలు పాల్గొన్నారు.



కేసీఆర్‌ను ఖమ్మం తీసుకొస్తున్న పోలీసు వాహనాలు (ఫైల్)

# మత్తు పదార్థాల నియంత్రణపై దృష్టి పెట్టండి

**డ్రగ్స్ నియంత్రణపై సమీక్ష సమావేశంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్**



సమీక్షలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, నవంబర్ 28: జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, దీనిపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న మూడు నెలలపాటు డ్రగ్స్, మాదక ద్రవ్యాల నియంత్రణ, వీటి వల్ల కలిగే దుష్పరిణామాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలన్నారు. ప్రతీ మండలంలో బృందాలుగా ఏర్పడి వారానికి రెండు విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా కేంద్రంలో డీ-అడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు అనువైన భవనం గుర్తించాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన వారిని గుర్తించి చికిత్స అందించే బాధ్యతను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అలాగే ప్రతీ ఉన్నత పాఠశాలలో స్పోకెన్ ఇంగ్లిష్‌కు అరగంట, క్రీడలకు అరగంట షెడ్యూల్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించారు. సమావేశంలో డీఈవో సోమశేఖర శర్మ, సంక్షేమాధికారి రాంగోపాల్‌రెడ్డి, షేర్ ఎన్‌జీవో డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు గోపాల్‌స్వామి, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

# 'డేటా ఎంట్రీ'ని వేగిరం చేయండి

**కుటుంబ సర్వే అధికారుల టెలీ కాన్ఫరెన్స్‌లో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్**



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. కుటుంబ సర్వే డేటా ఎంట్రీ, డబుల్ బెడ్‌రూం ఇల్లు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల స్థల గుర్తింపు తదితర అంశాలపై అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందనతో కలిసి కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, జిల్లా అధికారులతో గురువారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సర్వే డేటా ఎంట్రీ కోసం ఆసక్తి ఉన్న, ఉత్సాహవంతులైన యువతీ యువకులను నియమించుకోవాలని సూచచించారు. తహసీల్దార్లు తమ పరిధిలోని పాఠశాలలు, కాలేజీల్లోని కంప్యూటర్ ల్యాబ్‌లను వినియోగించుకోవాలని సూచించారు. కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, కరకగూడెం, చర్ల మండలాల్లో డేటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. చండ్రుగొండ, ములకలపల్లి, ఇల్లెందు మండలాల్లో భూ సమస్యలపై దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. తహసీల్దార్లు తమ పరిధిలోని సమస్యలు పరిష్కరించి నివేదికలు అందించాలన్నారు. పోడు పట్టాలు మంజూరై పాస్ బుక్కులు పొందని గిరిజన రైతులను ఐటీడీఏ అధికారుల సమన్వయంతో గుర్తించి జిల్లా అటవీ శాఖ అధికారి సూచనలతో పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయించాలని సూచించారు.

## కేసీఆర్ దీక్ష ప్రాముఖ్యతను..
# భావితరాలకు తెలియజేస్తాం

- నేడు ఖమ్మం నగరంలో ఘనంగా దీక్షా దివస్ కార్యక్రమాలు
- బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఉద్యమ ఫొటో ఎగ్జిబిషన్, సభ
- విలేకరుల సమావేశంలో ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం, నవంబర్ 28: 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ చచ్చుడో..' అనే నినాదంతో 2009 నవంబర్ 29న ఉద్యమసారథి, స్వరాష్ట్ర సాధకుడు కేసీఆర్ చేపట్టిన దీక్ష గురించి, దాని ప్రాముఖ్యత గురించి భావితరాలకు తెలియజేసేందుకు ఖమ్మంలో శుక్రవారం దీక్షా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు తెలిపారు. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపులో భాగంగా ఖమ్మం జిల్లా కేంద్రంలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం పిలుపునిచ్చారు. ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటి కేసీఆర్ ఉద్యమ చరిత్రను, ఉద్యమంతో ఖమ్మానికి ఉన్న అనుబంధాన్ని దీక్షా దివస్ సందర్భంగా చాటి చెప్పేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా ఖమ్మంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేయనున్నట్లు తెలిపారు. పెవిలియన్ గ్రౌండ్ వద్దనున్న తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఘన నివాళులర్పించి జిల్లా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాలన్నీ మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. అనంతరం పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ ఉద్యమ ఫొటో ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు.

**భద్రాద్రి జిల్లాలోనూ భారీగా కార్యక్రమాలు: ఎంపీ వద్దిరాజు**


అనంతరం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జిగా ఉన్న తన ఆధ్వర్యంలో ఆ జిల్లాలోనూ పెద్ద ఎత్తున దీక్షా దివస్ కార్యకమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మలిదశ ఉద్యమానికి ఖమ్మం జిల్లానే ఊపిరి పోసిందని గుర్తుచేశారు. 15 ఏళ్ల క్రితం కేసీఆర్ చావు నోట్లో తల పెట్టిన కేసీఆర్.. శాంతియుత పద్ధతిలో తెలంగాణను సాధించారని జ్ఞప్తికి తెచ్చారు. అబద్ధాలతో ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎన్నికల హామీల అమలులో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు బానోతు చంద్రావతి, బిచ్చాల తిరుమలరావు, బీరెడ్డి నాగచంద్రరెడ్డి, ఖమర్, బెల్లం వేణు, శీలంశెట్టి వీరభద్రం, తోట వీరభద్రం, తెలంగాణ ఉద్యమకారులు ఉప్పల వెంకటరమణ, బొమ్మెర రామ్మూర్తి, డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, సతీశ్, గొట్టెముక్కుల శీను, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు, చిత్రంలో ఎంపీ వద్దిరాజు

# నాణ్యమైన భోజనం అందించాలి

**ఖాళీ ప్లేట్లతో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ**




ఖమ్మం నగరంలో ఖాళీ ప్లేట్లతో ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 28: ప్రభుత్వ విద్యా సంస్థల్లో అధ్వానంగా ఉన్న మధ్యాహ్న భోజనం అమలు తీరు, విద్యార్థిని శైలజ మరణం, మాగనూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు ఖాళీ ప్లేట్లతో ఖమ్మం నగరంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ ఎందరో పేద తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ, గురుకుల పాఠశాలల్లో చేర్పించి చదివిస్తున్నారని, వారికి నాణ్యమైన భోజనం అందించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. భోజనం నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. నాణ్యమైన భోజనం అందించి, విద్యార్థులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ర్యాలీలో పీడీఎస్‌యూ నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, పృథ్వీ, యశ్వంత్, వెంకటేశ్, ప్రసాద్, కావ్య, అలేఖ్య, అనూష, సింధు, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# ఉడకని అన్నం, నీళ్ల చారు మాకొద్దు..

- ఖమ్మంలో ఎన్నెస్పీ క్యాంపు స్కూల్ విద్యార్థుల ఆందోళన
- నాణ్యమైన భోజనం అందేలా చూస్తామని డీఈవో హామీ



ఉడకని అన్నం, నీళ్ల చారును చూపిస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 28: ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు మాకొద్దంటూ ఖమ్మం నగరంలోని ఎన్నెస్పీ క్యాంపు పాఠశాల విద్యార్థులు గురువారం ఆందోళనకు దిగారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో ఈ అన్నం తినలేమని, మెనూ ప్రకారం వడ్డించాలని నినాదాలు చేశారు. దీనికి పీడీఎస్‌యూ నాయకులు మద్దతు తెలపడంతో సుమారు 2 గంటలపాటు విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. వివరాలు తెలుసుకున్న డీఈవో సోమశేఖర శర్మ పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులను మందలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మళ్లీ భోజనం వండించి విద్యార్థులకు వడ్డించడంతో వారు శాంతించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ బడి పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, అధికారులు పర్యవేక్షించి నాణ్యమైన భోజనం అందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.